ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కడప
జిల్లా వార్తలు

5

సోమవారం 26 ఫిబ్రవరి 2024

ఈ ఎన్నికలు

చాలా కాస్ట్లీ గురూ..

సీఎం జగన్ వైనాట్ 175 అని నొక్కి చెబుతుండగా.. ప్రతిపక్ష నేత చంద్రబాబు సైతం వైనాట్ పులివెందుల అంటూ సవాల్ విసరుతున్నారు. ఈ నేప థ్యంలో జగన్ సొంత జిల్లాలో మెజార్టీ స్థానాలను కైవసం చేసుకునేందుకు తన అంగ అర్థబలంతో దేనికైనా సిద్ధపడుతున్నట్లు చెబుతున్నారు. ఇక జగన్ సొంత ఊరిలోనే దెబ్బకొట్టి ఎక్కువ సీట్లు గెలుపొంది తమ తడఖా చూపేందుకు టీడీపీ తమ కేడర్‌ను బలపరిచి సమాయత్తమవుతోంది. దీంతో అధికార వైసీపీ ఒక్కో నియోజకవర్గంలో రూ.100 నుంచి రూ.150 కోట్లు అయినా ఖర్చు చేసేందుకు రెడీ అవుతున్నట్లు సమాచారం.

- వైసీపీకి జీవన్మరణ సమస్యగా మారిన ఎన్నికలు
- ఒక్కో అసెంబ్లీకి రూ.100 నుంచి 150 కోట్లు పంచేందుకు సిద్ధం
- సొంత పార్టీ అసంతృప్త నేతలకు భారీగా డబ్బుల పంపిణీ



(కడప - ఆంధ్రజ్యోతి): జిల్లాలో త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలు గతంలో ఎన్నడూ లేని విధంగా చాలా కాస్ట్లీగా జరిగే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. ఈ ఎన్నికలు వైసీపీకి జీవన్మరణ సమస్యగా మారనున్నాయి. గతంలో ఏ ప్రభుత్వాలు చేయని విధంగా ఈ ఐదేళ్ల పాలనలో రాజకీయ ప్రత్యర్థులను ఇబ్బందులకు గురి చేయడం, ఆర్థిక మూలాలు దెబ్బతీయడం, తప్పుడు కేసులు బనాయించడం.. ఇలా రకరకాల వేధింపులకు గురి చేశారు. ఇక అధికారం మాటున అడ్డగోలు పనులు చేశారు. అధికారంలోకి రాకపోతే మా సినిమా క్లోజ్ అవుతుందనే భయం కొందరు వైసీపీ నేతల్లో ఉందంటారు. అందుకే అధికారం చేజిక్కించుకోవడానికి దేనికైనా.. ఎంతకైనా సిద్ధం అనే ధోరణిలో ఉన్నారు. ఇందుకోసమే జగన్ కూడా వచ్చే ఎన్నికల్లో అడ్డదారుల్లో ఓట్లు సంపాదించేందుకు సిద్ధమ య్యే సిద్ధం సభలు జరుపుతున్నారనే విమర్శలున్నాయి. అందుకే ఈసారి ఎన్నికలు చాలా కాస్ట్లీగా మారనున్నాయని అంటున్నారు.

ఒక్కో నియోజకవర్గానికి రూ.100 నుంచి 150 కోట్లు

అధికారం చేతిలో ఉంటే నిస్సిగ్గుగా జనాలు ఏమనుకున్నా ఫర్వాలేదు.. అడ్డగోలుగా బరితెగించవచ్చనేది వైసీపీ ప్రభుత్వాన్ని చూశాకే తెలుస్తుందంటూ కొన్ని విమర్శలున్నాయి. జనాలకు నవరత్నాలు ఇచ్చేశాం, ప్రశ్నించే మీడియాపై ఎల్లో మీడియా అంటూ ముద్ర వేసి అవసరమైతే కేసులకు తెగబడుతున్నాం.. ఇక మమ్మల్ని ఎవరు ఆపేది, మాకు అడ్డు ఎవరంటూ కొందరు జిల్లాలో వైసీపీ నేతలు అడ్డగోలుగా బరితెగించారంటారు. అధికారం మాటున రూ.కోట్లు విలువ చేసే భూములు లాక్కోవడం, సహజ వనరులైన ఇసుకను లూటీ చేసి పోగేసుకోవడం, ఇక బదిలీల నుంచి ప్రతి దాంట్లో సెటిల్‌మెంట్లు చేసుకుంటూ కొందరు అడ్డగోలుగా సంపాదించారనే విమర్శ ఉంది. ఇలా అక్రమంగా సంపాదించిన సొమ్మునే ఓటర్లకు నోట్లుగా ఎర వేసి మళ్లీ గెలవాలనే సిద్ధపడుతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అందుకే కొన్ని చోట్ల ఒక్కో నియోజకవర్గానికి రూ.వంద కోట్ల నుంచి 150 కోట్లు ఖర్చు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారంటూ వైసీపీ వర్గాల్లోనే టాక్ నడుస్తున్నట్లు చెబుతారు.

ఖర్చుకు వెనుకాడేది లే..

సీఎం జగన్ తన తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో లేని విధంగా టీడీపీ అధినేత చంద్రబాబు సహా పలువురు ముఖ్యనేతలపై తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపి ఇబ్బందులకు గురి చేశారంటారు. దీంతో ఎలాగైనా సరే జగన్‌ను సొంత జిల్లాలో దెబ్బకొట్టాలని టీడీపీ, జనసేన భావిస్తోంది. ఇక ఐదేళ్లలో కొందరు వైసీపీ నేతల అరాచకాలకు అడ్డే లేకుండా పోయింది. కడప, బద్వేలు, ప్రొద్దుటూరు, మైదుకూరు, జమ్మలమడుగు, కమలాపురంలో వందల కోట్లు విలువైన ప్రభుత్వ భూములు, ప్రైవేటు స్థలాలను స్వాధీనం చేసుకున్నారనే ఆరోపణలున్నాయి. పులివెందుల అంటే అదో సామ్రాజ్యం, వైసీపీలో నవరత్నాల ద్వారా లబ్ధి ఎంత మంది పొందారో కానీ.. జిల్లా వ్యాప్తంగా వైసీపీ బాధితులు కూడా ఎక్కువే ఉన్నారు. వీరంతా వచ్చే ఎన్నికల్లో రివర్స్‌లో ఓటు వేసి బుద్ధి చెబుతారనే భయం ఉందంటారు. అందుకే ఈ ఎన్నికల్లో వైసీపీ ఎంతకైనా తెగబడేందుకు సిద్ధపడు తున్నట్లు సమాచారం.

ఈ ఎన్నికలు హోరాహోరీగా..

ఈసారి ఎన్నికలను టీడీపీ, వైసీపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. దీంతో జిల్లాలో కొన్ని చోట్ల ఎన్నికలు హోరాహోరీగా సాగనున్నాయి. వైసీపీకి సంబంధించి జిల్లాలో ఇంకా అధికారికంగా అభ్యర్థుల జాబితా ప్రకటించలేదు. టీడీపీ మాత్రం జిల్లాలో మూడు స్థానాలను మాత్రమే ప్రకటించింది. ఇక ఇప్పటికే కడపలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, టీడీపీ ఇన్‌చార్జ్ మాధవీరెడ్డిల మధ్య ప్రచార హోరుతో పాటు మాటల తూటాలు పేలుతున్నాయి. ఇటీవల టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య జరిగిన గొడవ తీవ్ర ఉద్రిక్తతో పాటు ప్రతిష్ఠాత్మకంగా మారింది. డిప్యూటీ సీఎం అంజద్ బాషా సోదరుడు అహ్మద్‌బాషా చేసిన వ్యాఖ్యలను టీడీపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఇక్కడ పోరు చాలా తీవ్రస్థాయిలో ఉన్నట్లు చెబుతారు. ఇక్కడ గెలిచేందుకు వంద కోట్లు పెట్టేందుకు ఓ పార్టీ సిద్ధంగా ఉందంటారు. కమలాపురంలో ఒక అభ్యర్థి అయితే వంద కోట్లు ఖర్చు పెడతా, గెలుపు నాదే అంటూ చెబుతున్నాడంటారు. ఇక జమ్మలమడుగులో కూడా ఎంత ఖర్చు అయినా తగ్గేది లేదంటున్నారు. ఇక ప్రొద్దుటూరులో ఒక పార్టీ అభ్యర్థి అయితే గెలిచేందుకు ఎన్ని కోట్లు ఖర్చు అయినా వెనుకాడేది లేదంటున్నారు. ఇక పులివెందుల, జమ్మలమడుగు ప్రాంతాలలో పరిస్థితి చెప్పనవసరం లేదు. ఇప్పటికే అసంతృప్తి నేతలకు స్థాయిని బట్టి రూ.లక్షల నుంచి రూ.కోటికి కూడా ఇచ్చారని ప్రచారం ఉంది. ఎన్నికల స్ట్రాటజీలో భాగంగా అధికార పార్టీ వారి అసంతృప్త నేతలకు భారీగా డబ్బుల పంపిణీ కార్యక్రమం చేపట్టారంటారు. దీన్ని బట్టి చూస్తే వచ్చే ఎన్నికలు చాలా కాస్ట్లీగా మారనున్నాయి.

సతీష్‌రెడ్డిని కలిసిన బీటెక్ రవి

- పులివెందులలో టీడీపీ గెలుపునకు సహకరించండి



సతీష్‌రెడ్డితో వేంపల్లెలోని ఆయన స్వగృహంలో మాట్లాడుతున్న బీటెక్ రవి

వేంపల్లె, ఫిబ్రవరి 25: ఎన్నో ఏళ్లుగా టీడీపీలో కలిసి కష్టపడి పనిచేశాం, పులివెందుల ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం వచ్చింది. పార్టీ గెలుపునకు సహకరించాలని శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ సతీష్‌రెడ్డిని పులివెందుల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవి కోరారు. టీడీపీకి రాజీనామా చేసి నాలుగు సంవత్సరాలకు పైగా రాజకీయాలకు దూరంగా ఉంటున్న సతీష్‌రెడ్డిని శనివారం వైసీపీ ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్ సురేష్‌రెడ్డితో కలిసి పార్టీలోకి ఆహ్వానించారు. దీంతో అలర్ట్ అయిన బీటెక్ రవి ఆదివారం ఉదయం సతీష్‌రెడ్డిని వేంపల్లెలోని ఆయన ఇంట్లో కలిశారు. సుమారు గంటపాటు మాట్లాడారు. పార్టీలోకి తిరిగి రావాలని.. అందరం కలిసి పనిచేద్దామని.. ఈ విషయంపై చంద్రబాబునాయుడుతో కూడా మాట్లాడుతామని సతీష్‌రెడ్డికి బీటెక్ రవి తెలిపినట్లు తెలిసింది. రెండు మూడు రోజుల్లో కార్యకర్తలతో చర్చించి నిర్ణయం తీసుకుంటానని సతీష్‌రెడ్డి బీటెక్ రవికి తెలిపారు. త్వరలో కార్యకర్తలతో సమావేశం అయ్యేందుకు సతీష్‌రెడ్డి సిద్ధమవుతున్నారు. ఏ నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

సతీష్‌రెడ్డిని కలిసిన పుత్తా

వేంపల్లెలో శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ సతీష్‌రెడ్డిని కమలాపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి కలిశారు. ఆదివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో సతీష్‌రెడ్డి ఇంటికి పుత్తా వెళ్లి సుమారు గంటకుపై ఏకాంతంగా చర్చలు జరిపి పార్టీలోకి తిరిగి రావాలని సతీష్‌రెడ్డిని కోరారు.

జిల్లా అభివృద్ధిని గాలికొదిలేసిన జగన్

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి



వడ్రంగుల ఆత్మీయ సమావేశంలో శ్రీనివాసరెడ్డి, మాధవీరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 25: సీఎం వైఎస్ జగన్ జిల్లాలో అభివృద్ధిని గాలికి వదిలేశాడని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కడప నగరం వైఎస్ఆర్ ఆడిటోరియంలో వడ్రంగుల సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు మూడుసార్లు ఆర్భాటంగా భూమి పూజ చేసిన జగన్ ఎందుకు పూర్తి చేయలేకపోయారని ప్రశ్నించారు. ఉక్కు పరిశ్రమ పూర్తయితే ఉద్యోగాలు వస్తాయని నిరుద్యోగులు పెట్టుకున్న ఆశలను ఈ ప్రభుత్వం నీరుగార్చిందని విమర్శించారు. పేదల ఆకలి తీర్చేందుకు చంద్రబాబు అన్నక్యాంటీన్లను తీసుకువస్తే జగన్ కూల్చేశారని మండిపడ్డారు. వడ్రంగులకు టీడీపీ ఐదు లక్షల బీమా కల్పిస్తుందని స్పష్టం చేశారు. టీడీపీ కడప అభ్యర్థి మాధవీరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన సాగుతోందని వైసీపీ తీరుపై మండిపడ్డారు. టీడీపీ అధికారంలోకి రాగానే వడ్రంగుల న్యాయమైన సమస్యలను పరిష్కరిస్తామన్నారు. రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శులు బి.హరిప్రసాద్, గోవర్ధనరెడ్డిలు మాట్లాడుతూ టీడీపీ హయాంలో వడ్రంగుల సోదరులకు మూ డుసెంట్లు నివాసాలకు కేటాయంచడంతో ఆచారి కాలనీగా వెలిసిందని గుర్తు చేశారు. సమావేశంలో సంజీవరాయ ఆచారి, శ్రీనివాసులు, మస్తాన్‌వలి రామాంజనేయ ఆచారి, సురేంద్ర, పవన్‌కుమార్, వడ్రంగులు పాల్గొన్నారు.

జంగాలపల్లెలో చిరుత సంచారం

- మేకను పట్టుకున్న చిరుత
- భయాందోళనలో గ్రామ ప్రజలు



చిరుత దాడిలో గాయపడిన మేక

సిద్దవటం, ఫిబ్రవరి 25: సిద్దవటం మండలం జంగాలపల్లె దళితవాడలో శనివారం అర్ధరాత్రి చిరుత సంచరించింది. భాగమ్మ అనే మహిళకు చెందిన పూరి గుడిసెలో ఉన్న మేకల మందపై దాడి చేసి మేకను నోట కరవడంతో, శబ్దాలు విన్న భాగ్యమ్మ, బంధువులు లేచి చూడగా మేకను ఈడ్చుకొని వెళుతున్న చిరుత కనిపించింది. వారి కేకలు విని వచ్చిన గ్రామస్థులు చిరుతను అడవిలోకి తరిమి వేశారు. చిరుత దాడిలో గాయాల పాలైన మేకకు స్థానిక వెటర్నరీ వైద్యశాలలో చికిత్స చేయించామని భాగ్యమ్మ తెలిపింది. ఈ విషయంపై సిద్దవటం ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి వివరణ కోరగా చిరుత దాడిలో గాయపడ్డ మేకను పరిశీలించామని, వన్యప్రాణులు గ్రామాల్లోకి రాకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలియజేశారు.

రాచమల్లు అరాచక పాలనకు చరమగీతం పాడుదాం

- టీడీపీ నాయకుడు సీఎం సురేష్ నాయుడు

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 25: ప్రొద్దుటూరులో వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి, ఆయన బావమరిది బంగారురెడ్డిల అరాచక పాలనకు చరమగీతం పాడాలని టీడీపీ నాయకుడు సీఎం సురేష్ నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక 41వ వార్డులో మాజీ కౌన్సిలర్లు గంజికుంట ఆంజనేయులు ఆయన భార్య గంజికుంట క్రిష్ణవే ణిలు వంద కుటుంబాలతో కలిసి సీఎం సురేష్‌నాయుడు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. సురేష్ నా యుడు వారికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సురేష్ నాయుడు మాట్లాడుతూ ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో ఎమ్మెల్యే రాచమల్లు, ఆయన బావమరిది బంగారురెడ్డికి తప్ప అక్కడ వున్న బీసీ మహిళా చైర్‌పర్సన్‌కు గానీ కౌన్సిలర్లకు గానీ ఎలాంటి అధికారాలు లేవన్నారు. కేవలం బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకోవడం కోసం మున్సిపల్ చైర్‌పర్సన్ చేశారు తప్ప వారికి ఎలాంటి స్వతంత్ర లేదన్నారు. ఎమ్మెల్యే వెంట ఆమెను తిప్పుకోవడం తప్ప మున్సిపాలిటీ నిర్ణయాలలో ఆమె పాత్రలేదన్నారు. ఆమె సంతకాలకు తప్ప మరే అధికారం లేదన్నారు. అలాగే ప్రొద్దుటూరులో పద్మశాలీయ రాష్ట్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉన్నా.. ఆమె ఒక్క పద్మశాలీయ కుటుంబానికి ఒక్క రూపాయి ఆ కార్పొరేషన్ నుంచి నిధులు ఇచ్చింది లేదన్నారు. కాబట్టి బీసీలు ఆలోచించి వచ్చే ఎన్నికల్లో టీడీపీని ఆదరించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. అప్పుడే బీసీలకు సంక్షేమం, అభివృద్ధి సాధ్యమతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి, మాజీ మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్మన్ వీఎస్ ముక్తియార్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఈవీ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శెట్టిపల్లె ప్రభాకర్‌రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లబోతు నాగరాజు, కౌన్సిలర్ మునీర్ తదితరులు పాల్గొన్నారు.



సురేష్‌నాయుడు ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన మాజీ కౌన్సిలర్లు గంజికుంట ఆంజనేయులు, క్రిష్ణవేణి

జిల్లాలో ప్రశాంతంగా గ్రూపు-2 పరీక్ష

- 20,316 మంది అభ్యర్థులు హాజరు



పరీక్ష కేంద్రం వద్ద హాల్‌టిక్కెట్ నంబర్లను పరిశీలించుకుంటున్న అభ్యర్థులు

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 25: జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన ఏపీపీఎస్సీ గ్రూప్-2 స్ర్కీనింగ్ పరీక్ష ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రశాంతంగా జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్-2 ఉద్యోగాల నియమాకం కోసం ఆదివారం నిర్వహించిన స్ర్కీనింగ్ పరీక్షకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 67 పరీక్షా కేంద్రాలలో ఏర్పాట్లు చేశారు. ఈ పరీక్షలకు 23,807 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. అందులో 20,316 మంది పరీక్షలకు హాజరయ్యారు. దీంతో అభ్యర్థుల హాజరు శాతం 85.34 శాతంగా నమోదయ్యింది. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకుని అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. ఈ పరీక్షలు ఎలాంటి అవాంతరాలు లేకుండా సజావుగా జరిగేందుకు పోలీసు అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు పర్యవేక్షించాయి. ఈ మేరకు కలెక్టర్ విజయరామరాజు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.



అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

పాలక పక్షపాతం


- టీడీపీ గెలిచిన వార్డులపై శీతకన్ను
- ఓట్లు వేయలేదని.. రోడ్లు వేయని వైనం
- బద్వేలు మున్సిపాలిటీలో వింత ధోరణి



13 వ వార్డు అధ్వాన్నంగా ఉన్న రహదారి

మేము గెలిచిన చోటే అభివృద్ధి పనులు.. మాకు ఓట్లు వేసిన వారికే మౌలిక వసతులు.. మా తీరు ఇంతే అంటూ బద్వేలు మున్సిపాలిటీలో వైసీపీ పాలకపక్షం వ్యవహరిస్తోంది. అధికారంలో మేమున్నాం, మమ్మల్ని గెలిపించిన ప్రాంతాలలోనే అభివృద్ధి పనులు చేపడతామంటూ పక్షపాత వైఖరి అవలంభిస్తోంది. వీరు ప్రదర్శిస్తున్న వింత ధోరణి చూసి ప్రజలు బోరా అని ముక్కున వేలేసుకుంటున్నారు.

బద్వేలు, ఫిబ్రవరి 25: బద్వేలు మున్సిపాలిటీలో 35 వార్డులు ఉంటే.. అందులో 6, 13, 25, 33 వార్డులలో టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారు. మరో వార్డులో స్వతంత్ర అభ్యర్థి గెలిచినా టీడీపీలో కొన సాగుతున్నారు. ఇక్కడ ఆ నాలుగు వార్డులలో అభివృద్ధి పనులు చేపట్టడంలో మునిసిపల్ పాలకపక్షం నిర్లక్ష్యం చేస్తోంది. ఇందుకు కారణం అక్కడ వైసీపీ గెలవకపోవడమే అన్నది ప్రధానంగా చెప్పవచ్చు. మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు రూ.130 కోట్ల 60 లక్షల నిధు లు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధుల ద్వారా రోడ్లు, డ్రైనేజీలు లాంటి మౌలిక వసతులకు సంబంధించిన పనులు చేపట్టాల్సి ఉంది. అయితే పై నాలుగు వార్డులను మినహాయించి మిగతా వార్డులలో పనులు చేపట్టడం పాలకవర్గం పక్షపాత ధోరణి తేట తెల్లమవుతోంది.



33వ వార్డులో సిమెంటు రోడ్డుకు నోచుకోని రహదారి

ఆ నాలుగు వార్డులపై శీతకన్ను

పట్టణంలో చాలా కాలంగా అభివృద్ధికి అవకాశం లేకుండాపోయింది. ఇప్పుడు రూ.130.60 లక్షలు ప్రభుత్వం నిధులు కేటాయించడంతో అన్ని చోట్లా అభివృద్ధి పనులు జరుగుతాయిని పట్టణవాసులు ఆశించారు. అయితే మున్సిపాలిటీ పాలకపక్షం మాత్రం ఆ నాలుగు వార్డులను అభివృద్ధి అంశంలో పక్కనపెట్టినట్లు వ్యవహరిస్తోంది. వీటితో పాటు రెబల్ అభ్యర్థి గెలిచిన వార్డులో కూడా ఇలాంటి పరిస్థితి ఎదురవుతున్నట్లు చెప్పవచ్చు. ఇక్కడి కౌన్సిలర్లు అనేకమార్లు మున్సిపాలిటీ సమావేశాలలో మా వార్డులలో రోడ్లు, డ్రైనేజీలు లాంటి మౌలిక వసతులు కల్పించాలని పదేపదే వినతులు సమర్పించినా ఫలితం లేకుండా పోయింది. ఆ వార్డులలో టీడీపీ గెలిచి ఉండవచ్చు కానీ వైసీపీకి ఓట్లు వేసిన వారు ఉన్నారు. అయినా ఆ వార్డులను పక్కనపెట్టడం జరిగింది. దీంతో అభివృద్ధికి మౌలిక వసతులకు అవకాశం లేకుండా పోయింది. దీనికి తోడు రూ.130.60 కోట్ల ఖర్చు చేసేం దుకు సమయం ముగిసినట్లు సమాచారం. ఇక త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ రానుంది. టీడీపీ గెలిచిన వార్డులలో అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం లేకుండాపోయింది.

మా వార్డుల్లో పన్నులు వసూళ్లు చేయలేదా..

మున్సిపాలిటీలోని వైసీపీ పాలకపక్షం టీడీపీ గెలిచిన వార్డులలో అభివృద్ధి పనులు చేపట్టక పోవడం పట్ల ఆవార్డు ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అన్ని వార్డులలో లాగే మా వార్డులలో కూడా అన్ని రకాల పన్నులు వసూలు చేస్తున్నారని.. మరి అలాంటపుడు అభివృద్ధి పనులు చేపట్టాలి కదా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పాలకపక్షం బద్వేలు మున్సిపాలిటీలోని అన్ని వార్డులు సమానమే అని భావిస్తే కొంత అయినా ప్రయోజనం కలిగే అవకాశం ఉంది. లేదంటే వారి అసంతృప్తిని మూటగట్టుకోవాల్సిన పరిస్థితి తప్పదని పిస్తోంది. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ క్రిష్ణ దృష్టికి తీసుకెళ్లగా.. తాను కొత్తగా బాధ్యతలు చేపట్టానని.. ప్రణాళికబద్ధంగా అన్ని వార్డులలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు తగు చర్యలు చేపడతామని పేర్కొన్నారు.



వార్డులలో అభివృద్ధి పనులు చేపట్టాలని కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న టీడీపీ కౌన్సిలర్లు(ఫైల్‌ఫొటో)

విద్యార్థులు ఫుల్.. ఉపాధ్యాయులు నిల్

- ఇద్దరు ఉండాల్సిన పాఠశాలల్లో ఒకే ఉపాధ్యాయుడు
- పాఠ్యాంశాల బోధనకు ఇబ్బందులు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

నందలూరు, ఫిబ్రవరి 25: ఇద్దరు ఉపాధ్యాయులు ఉంటేనే ఐదు తరగతులకు బోధన కష్టతరం. కానీ విద్యార్థులు ఫుల్.. ఉపాధ్యాయులు నిల్ అన్న కోణంలో మండలంలోని పలు పాఠశాలలు కొనసాగుతున్నాయి. ఏకోపాధ్యాయుల వల్ల మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులు పాఠ్యాంశాల బోధనలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని ఐదు తరగతులు గల ప్రాథమిక పాఠశాలలైన చాపలవారిపల్లెలో 38 మంది విద్యార్థులు, కుందా నెల్లూరులో 22 మంది, టంగుటూరు ఉర్దూలో 22, గట్టుమీదపల్లెలో 23, ఎర్రచెర్లోపల్లె గ్రామంలో 38, ఆడపూరులో 22, నందలూరు హరిజనవాడలో 23, అరవపల్లె ఉర్దూలో 22, పాటూరు యానాది కాలనీలో 21 మంది విద్యార్థులు విద్య అభ్యసిస్తున్నారు.

ఈ పాఠశాలల్లో కేవలం ఒక్క ఉపాధ్యాయుడు మాత్రమే ఉన్నారు. 21 మంది విద్యార్థు లు ఉంటే ఆ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండా లి. కానీ దాదాపు తొమ్మిది పాఠశాలల్లో కేవలం ఒకే ఉపాధ్యాయుడితో పాఠాలు బోధించడం కష్టతరంగా మారింది. పేద, మధ్యతరగతి విద్యార్థుల తల్లిదండ్రులు సాధారణంగా పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపుతారు. దీనికి ప్రధాన కారణం విద్యతో పాటు పలు రకాల (మధ్యాహ్న భోజనం, యూనిఫాం, పుస్తకాలు, నోట్‌బుక్కులు, ఇతర సదుపాయాలు) ఉచిత వసతులు ఉండటం. కానీ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతామంటున్న ప్రభుత్వా లు ఆ దిశగా సౌకర్యాలు కల్పించడంలో విఫలం చెందుతున్నాయని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం నాడు-నేడు పనుల ద్వారా విద్యార్థులకు ఎన్నో వసతులు కల్పిస్తామన్న ప్రభుత్వం, ఆ సౌకర్యాలను నెరవేర్చడంలో అలసత్వం వహిస్తోందని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. గత కొద్ది రోజుల క్రితం అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అభిషిక్త్ కిశోర్ పోలింగ్ బూత్‌ల పరిశీలనలో భాగంగా వైసీపల్లె ప్రాథమిక పాఠశాలను సందర్శించిన సమయంలో విద్యార్థులతో ఇష్టాగోష్టి నిర్వహించారు. ఆ సమయంలో విద్యార్థులు 'మాకు టీచర్ కావాలి సార్' అని కలెక్టర్‌ను కోరిన సంఘటన చోటు చేసుకుంది.

అక్షరాస్యతతోనే గ్రామంతో పాటు రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయన్నది అక్షర సత్యం. ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు విలువైన విద్యను అందించడం ప్రభుత్వాల బాధ్యత అని, ఇప్పటికైనా 22 మందికి పైగా విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో ఇద్దరు ఉపాధ్యాయులను ఏర్పాటు చేసి విద్యార్థుల ఉన్నతికి పాటుపడాలని మండలంలోని పలువురు తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.



టీచర్ కావాలి సార్ అని కలెక్టర్‌ను కోరుతున్న విద్యార్థులు (ఫైల్)





38 మంది విద్యార్థులు ఉన్న వై.సి.పల్లె పాఠశాల, 22 మంది విద్యార్థులు ఉన్న అరవపల్లె ఉర్దూ పాఠశాల

విద్యార్థులకు తగిన ఉపాధ్యాయులు ఉండాలి



విద్యార్థులకు తగిన ఉపాధ్యాయులు ఉంటేనే పాఠాలు బోధించడం సులభతరం అవుతుంది. ఐదు తరగతులు ఉండి ఒక ఉపాధ్యాయుడు ఉంటే అన్ని తరగతుల పాఠాలు బోధించడం ఎలా సాధ్యం. నందలూరు అరుంధతివాడలోని ప్రాథమిక పాఠశాలలో 23 మంది విద్యార్థులు ఉంటే ఒకే ఒక టీచర్ ఉన్నారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వారి ఉన్నతి కోసం, ప్రభుత్వం తగినంత మంది టీచర్లను ఏర్పాటు చేయాలి.

- మోడపోతుల రాము, టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు, నందలూరు

నాణ్యమైన విద్యకు ఉపాధ్యాయులు అవసరం



విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడం ఎంతో అవసరం. అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఉండాలి. కానీ మండలంలోని పలు పాఠశాలల్లో ఒక ఉపాధ్యాయుడితో పాఠాలు బోధించడం వల్ల పిల్లలకు సరైన విద్య అందదు. సీఎం జగన్ గొప్పలు పలకడం మాని టీచర్ల కొరతను తీర్చాలి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఐదు తరగతులు ఉండే ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకనుగుణంగా ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాలి.

- రేవూరి వేణుగోపాల్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

చిట్వేలిలోనూ ఉపాధ్యాయుల కొరత

చిట్వేలి, ఫిబ్రవరి 25 : పాలకులు విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామంటూ చెబుతున్నా అది అమలుకు నోచుకోవడం లేదు. తాంబూలాలు ఇచ్చాం.. పెళ్లికి రండి అన్న చందంగా నాడు-నాడు కింద పాఠశాలలను అభివృద్ధి చేశామని చెప్పుకుంటున్నపాలకులు విద్యార్థుల విద్య పట్ల ప్రాధాన్యం చూపడం లేదు. చాలాచోట్ల పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదు. మండలంలో ఐదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక కస్తూరిబా, 58 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అధికారులు కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు క్రీడలకే దూరమవుతున్నారు. ఇందులో చిట్వేలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడు కొరతగా ఉంది. పోలోపల్లిలో 2, వెంకటరాజుపల్లెలో ఇద్దరు ఉపాధ్యాయులు, కె.కందులవారిపల్లెలో ప్రధానోపాధ్యాయుడితో పాటు పీ.టీ.ఉపాధ్యాయుడి కొరత వేధిస్తోంది. కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉంది. వసతులు మాత్రం అంతంత మాత్రమే ఉన్నాయి. పాఠశాలలో విద్యార్థులకు ఆడుకోవడానికి క్రీడా మైదానం అడవిని తలపిస్తూ ఉంది. పరిస్థితిని గమనించిన చిట్వేలి సీహెచ్ఎస్ హెల్ప్‌లైన్ సొసైటీ సభ్యులు విద్యార్థులకు క్రీడా మైదానాన్ని తయారు చేసి ఇచ్చారు. అలాగే విద్యార్థులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన కాస్మొటిక్స్, ఇతర వస్తువులు ఇవ్వవలసినవి రాలేదు.



చెర్లోపల్లె ప్రాథమిక పాఠశాలలో ఒకే రూమ్‌లో అన్ని తరగతుల విద్యార్థులు

ప్రాథమిక పాఠశాలలో...

మండలంలో ప్రాథమిక పాఠశాలలు 58 ఉండగా 88 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. అయితే ఏ పాఠశాలలోనూ విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేరు. ఇందులో మండల వ్యాప్తంగా 30 మంది ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని చెర్లోపల్లె ప్రాథమిక పాఠశాలలో 57 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులకు గానూ ఒక్కరే ఉపాధ్యాయుడు పిల్లలకు విద్యను అందిస్తున్నారు. పరిస్థితిని గమనించిన గ్రామానికి చెందిన బాలకృష్ణయాదవ్, మరికొందరు తల్లిదండ్రులతో కలిసి మండల విద్యాశాఖాధికారికి వినతిపత్రం ఇచ్చారు. గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో వేలల్లో ఉన్న ఫీజులు కట్టలేక, గ్రామాల్లో ఉన్నత పాఠశాలలకు పంపుతున్న తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు ఏమిటని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం గురువుల పట్ల, విద్యార్థుల పట్ల ఏమీ పట్టనట్లు ఉన్నారని విమర్శలు వినబడుతున్నాయి.

ఆర్భాటాలు తప్ప విద్యార్థుల సమస్యలు పట్టవా..

పాలకులు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని చెప్పుకుంటున్న పాలకులు, విద్యార్థుల భవిష్యత్తును మాత్రం అంధకారంలోకి నెట్టేస్తున్నారు. 60 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో ఇద్దరు ముగ్గురు ఉండాల్సిన ఉపాధ్యాయులు ఒకరు మాత్రమే ఉంటున్నారు. రాష్ట్రంలో ఉన్న సమస్యకు ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదు. సకాలంలో డీఎస్సీ నోటిఫికేషన్ ప్రభుత్వం నిర్వహించి ఉంటే రాష్ట్రంలో నేడు ఈసమస్య ఉండేది కాదు. ప్రైవేటు పాఠశాలలు అధిక ఫీజులు కట్టలేక చాలా గ్రామాల్లో పిల్లలను ఇంటి దగ్గరే ఉండిపోతున్నారు. వెంటనే ఉపాధ్యాయుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి



చెన్నకేశవరెడ్డి (ఫైల్)

చక్రాయపేట, ఫిబ్రవరి 25: మండలంలోని కె.రాజుపల్లెకు చెందిన చెన్నకేశవరెడ్డి (22) అనే యువకుడు విద్యుదాఘాతంతో ఆదివారం మృతిచెందాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నకేశవరెడ్డి నెల్లూరులో సీఏ చదువుతూ మూడురోజుల కిందట ఇంటికి వచ్చాడు. గ్రామం సమీపాన పొలాల్లోకి అతని తండ్రి నీరుపాగట్టేందుకు వెళ్లాడు. తండ్రికి అన్నం పెట్టిరావాలని తల్లి చెప్పింది. అన్నం తీసుకొని చెన్నకేశవరెడ్డి పొలం వద్దకు వెళ్లాడు. అంతలో అతని తండ్రి కరెంటు వచ్చిందేమో స్టార్టర్ వద్దకెళ్లి ఆన్‌చేయమన్నాడు. అక్కడ వైర్లు తెగిపడి ఉండడం అతను గమనించలేదు. వైర్లు తగిలి అక్కడికక్కడే మృతిచెందగా ఎంతసేపటికి రాకపోవడంతో తండ్రి అక్కడికి వెళ్లాడు. అప్పటికే వైర్లు తగిలి కిందపడిఉన్నాడు. ఎదిగిన కొడుకు చనిపోవడంతో కుటుంబం దిగ్భ్రాంతిచెందింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకొని పోస్టు మార్టం నిమిత్తం వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఏపీపీఆర్ ఎంఈఏ నూతన కమిటీ ఎన్నిక

కడప(రూరల్) ఫిబ్రవరి 25 : ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా శాఖ ఎన్నికలు ఆదివారం జిల్లా పరిషత్ మీటింగ్ హాలులో నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ ఆఫీసర్‌గా ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రత్యేక పరిశీలకుడిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆర్.నాగిరెడ్డిలను రాష్ట్ర సంఘం ఏర్పాటు చేసింది. ఈ ఎన్నికల్లో ఇటీవల నూతనంగా ఎన్నికైన 12 సమితుల యూనిట్ సభ్యులతో పాటు కడప జిల్లా పరిషత్ యూనిట్ సభ్యులు హాజరై 21 మందితో కూడిన జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రెండవ పర్యాయం లంకా మల్లేశ్వర్‌రెడ్డిని ఎన్నుకోగా జిల్లా ప్రధాన కార్యదర్శిగా సి.శ్రీనివాసులరెడ్డిని, అసోసియేషట్ అధ్యక్షుడిగా పి.శ్రీనివాసులరెడ్డి, ట్రెజరర్‌గా జి.యాదర్థ భాస్కర్, ఉపాధ్యక్షుడిగా జి.రమేష్, ఎం.గోపీనాథ్, కె.ఎం.దస్తగిరిని ఎన్నుకున్నారు. అలాగే స్టేట్ కౌన్సిలర్స్‌గా ఎం.రామనాగసురేష్, టి.ఎన్.వి.ఆర్. క్రిష్ణశర్మ, వినందకిషోర్, కె.నరేంద్రలను ఎన్నుకున్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఆర్.రామ్‌మోహన్ రాజు, ఇ.శ్రీనాథ్‌బాబు, జె.మదన్‌కుమార్, ఎస్.రవికుమార్‌ను ఎన్నుకున్నారు. జాయింట్ సెక్రటరీలుగా డి.నరసయ్య, కె.శోభారాణి, సి.రూపేష్‌రెడ్డి, సి.యస్వంత్‌కుమార్‌లతో పాటు జేసీసీ మెంబర్‌గా ఎస్.హరిప్రసాద్‌బాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి శ్రీనివాసులు తెలిపారు. ఎన్నికైన వారికి నియామక పత్రాలను అందజేశామన్నారు. అనంతరం ఎన్నికైన నూతన కమిటీ సభ్యులను జడ్పీ ఛైర్మన్ అమర్‌నాథ్‌రెడ్డి శాలువలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గానికి అన్ని విధాలుగా సహాయసహకారాలను అందిస్తామన్నారు.

విజయమే లక్ష్యంగా బరిలోకి దిగాలి

కడప (స్పోర్ట్స్), ఫిబ్రవరి 25: విజయమే లక్ష్యంగా క్రీడాకారులు బరిలోకి దిగాలని ఎస్.జి.ఎఫ్ కార్యదర్శి అరుణకుమారి సూచించారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక డీఎస్ఏ స్టేడియంలో 70వ పురుషుల సీనియర్ జిల్లా స్థాయి కబడ్డీ సెలక్షన్స్ జరిగాయి. ముఖ్య అతిథిగా ఆమె హాజరై తొలుత క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. తదుపరి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన కబడ్డీ క్రీడాకారులు ఉత్సాహంగా ఎంపికల కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ప్రతిభకనబరిచిన క్రీడాకారులను వచ్చే మార్చి 3 నుండి 5వ తేదీ వరకూ వైజాగ్‌లో జరుగనున్న అంతర్‌జిల్లాల కబడ్డీ పోటీలలో పాల్గొనాల్సివుంటుందని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఆర్. వెంకటసుబ్బయ్య వివరించారు.

ఎంపికైన క్రీడాకారులు వీరే...: కె.హరిప్రసాద్‌రెడ్డి, జి. సమరసింహారెడ్డి, కె. చంద్రశేఖర్, కె. గిరీష్‌కుమార్, ఎ. వేణుసాయి, బి. వంశీ, ఎన్.ధనుష్‌రెడ్డి, జి.చైతన్య, కె.ప్రేమ్ చంద్‌రెడ్డి, ఎస్.రుష్యేంద్రసాయి, ఎం.రామాంజనేయులు, కె.సాయివిఘ్నేష్, స్టాండ్‌బైగా టి.గురుశివయ్య, పి.బాష, వి.వంశి, టి.గురువర్ధన్ ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఏ కబడ్డీ కోచ్ ఆర్. శ్రీధర్ పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

నెంబర్-1 జట్టుగా రాణించాలి



క్రీడాకారులతో గోవర్ధన్‌రెడ్డి

కడప (స్పోర్ట్స్), ఫిబ్రవరి 25: నెంబర్ ఒన్ కబడ్డీ జట్టుగా రాణించేలా జిల్లా సీనియర్స్ కబడ్డీ క్రీడా జట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.గోవర్ధన్‌రెడ్డి క్రీడాకారులకు సూచించారు. ఆదివారం స్థానిక రాజీవ్ మార్గ్‌లోని శివశివానీ హైస్కూల్‌లో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కబడ్డీ సీనియర్స్ (80 కేజీల విభాగం) జట్టు ఎంపిక ప్రక్రియ జరిగింది. ముఖ్యం అతిథిగా గోవర్ధన్‌రెడ్డి హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని మాట్లాడారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే మార్చి 8,9,10, తేదీలలో నెల్లూరు జిల్లా కోవూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి 70వ సీనియర్ కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

ఎంపికైన క్రీడాకారులు వీరే... : శివగణేష్‌రెడ్డి, దినేష్ చౌదరి, చెన్నకృష్ణ, చెన్నకేశవరెడ్డి, వంశీ, వీరకుమార్‌రెడ్డి, కిరణ్‌కుమార్, నవీన్, గణేష్, ఖ్యాతివర్ధన్‌రెడ్డి, శివారెడ్డి, వెంకట శ్రీసుభాస్ ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో శివశివానీ హైస్కూల్ డైరెక్టర్ నాగేంద్ర రెడ్డి, అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ప్రసాద్, ట్రెజరర్, జై చంద్రబాబు, వైవీయూ కబడ్డీ కోచ్ మనోహర్, సీనియర్ క్రీడాకారులు సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యాసాగర్ హాస్పిటల్‌లో రోబోటిక్ టెక్నాలజీ

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 25 : విద్యాసాగర్ హాస్పిటల్‌లో రాయలసీమలోనే ప్రప్రథమంగా ప్రపంచ ప్రసిద్ధిగాంచిన రోబోటిక్ టెక్నాలజీని మోకాళ్లు, కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సకు ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డి, కడప టీడీపీ అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి పాల్గొన్నారు. రోబోటిక్ ద్వారా మోకాలి మార్పిడి, పాక్షిక మోకాలి మార్పిడి, తుంటికీళ్ల మార్పిడి శస్త్రచికిత్స, రివిషన్ నీ రీప్లేస్‌మెంటు, సీటీ రేడియేషన్ అవసరం లేకుండా రియల్ ఇంటిలిజెన్స్ అండ్ హెల్త్ రోబోటిక్ ఆర్మ్ ఉపయోగించి శస్త్రచికిత్సలు చేయగలమని డాక్టర్ సి.విద్యాసాగర్‌రెడ్డి వివరించారు. వైద్యులు శస్త్రచికిత్స నైపుణ్యంతో పాటు అత్యాధునిక కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీ వాడడంతో ఎప్పుడూ ముందు ఉంటూ గత మూడునాలుగు సంవత్సరాల దేశ విదేశాల్లో రోబెటిక్ టెక్నాలజీపై విశేష అనుభవం రోబోటిక్ టెక్నాలజీ డిజైన్ చేసిన బృందంతో చర్చలు జరిపిన తరువాత ఈ టెక్నాలజీని తీసుకురావడం జరిగిందన్నారు. మోకాలి మార్పిడి హిప్ రీప్లేస్‌మెంటు నొప్పిని తగ్గించడం, పేషంటు రోజూ వారి పనులు పూర్తి స్థాయిలో పునరుద్ధరించడం కీలకమన్నారు. రోబోటిక్ టెక్నాలజీ ద్వారా వంద శాతం ఖచ్చితత్వం, త్వరితగతిన రికవరీ, తక్కువ నొప్పి, దీర్ఘకాలిక మన్నిక, తక్కువ బోన్‌లాస్, తక్కువ టిష్యూలాస్, సాధారణ మోకాలు అనే భావన సునాయసమైన మోకాలు, కదలికలు, సత్ఫలితాలు వంటి అనేక లాభాలు ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.శ్రీలక్ష్మి, హాస్పిటల్ సిబ్బంది, స్విఫ్ట్ అండ్ నిబ్యు కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



పుత్తా నరసింహారెడ్డిని సన్మానిస్తున్న విద్యాసాగర్‌రెడ్డి, శ్రీలక్ష్మి

దళితుడి పొలంపై రౌడీ మూకల దాడి

పెనగలూరు, ఫిబ్రవరి 25 : పెనగలూరు మండలం సింగారెడ్డిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వేనెంబరు 729/3లో కంబాలకుంట హరిజనవాడకు చెందిన పందికాళ్ల నారాయణకు 4.53 ఎకరాల డీకేటీ పొలం ఉంది. తన పూర్వీకుల నుంచి సంక్రమించిన 1బీ, ఆర్‌వోఆర్, పాసుపుస్తకాలు, రికార్డులు కూడా ఉన్నాయి.

కాగా, ఈ పొలం తమదంటూ సింగారెడ్డిపల్లెకు చెందిన ఉమా శంకర్ అనే వ్యక్తి అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడి సహకారంతో ఆదివారం 50 మందితో కలసి ఇనుప రాడ్లు, గడ్డపారలతో ఫెన్సింగ్ పోళ్లను ధ్వంసం చేసినట్లు బాధితుడు వాపోయాడు. మామిడి మొక్కలు, మునగచెట్లను పీకేస్తుండగా అడ్డు తగలబోయిన తమ కుటుంబ సభ్యులపై దాడి చేసేందుకు ప్రయత్నించడంతో తాము పారిపోయామని తెలిపాడు. ఈ విషయంపై పెనగలూరు ఏఎస్‌ఐ మల్లికార్జునకు ఫిర్యాదు చేయడంతోపాటు, ఇందుకు సంబంధించిన వీడియోలను కూడా అందజేశామన్నారు. ఈ సంఘటనపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని రాజంపేట డీఎస్పీకి కూడా ఫిర్యాదు చేశామన్నారు.

ఈ విషయంపై పెనగలూరు ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ తాను ముఖ్యమంత్రి బందోబస్తు కార్యక్రమంలో ఉండడంతో ఏఎస్ఐకి ఫిర్యాదు పత్రాలను అందజేయాలని తెలిపానన్నారు.



రైతు పొలానికి ఉన్న ఫెన్సింగ్ రాళ్లను తొలగిస్తున్న రౌడీమూకలు

వైవీయూ వసతిగృహాలను సందర్శించిన ఆర్డీవో

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 25 : వైవీయూ వసతిగృహాలను కడప ఆర్డీఓ మధుసూదన్ సందర్శించారు. గ్రూప్-2 పరీక్షలు తనిఖీ చేసేందుకు వచ్చిన ఆర్డీఓ, వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ చింతా సుధాకర్‌ను కలిశారు. వసతిగృహ పరిసరాలు, వంటశాలలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఇటీవల అస్వస్థతకు గురై కోలుకుని హాస్టలుకు వచ్చిన వారితో మాట్లాడారు. వారికి అందిన వైద్యసేవలు, వసతిగృహ సౌకర్యాలపై ఆరా తీశారు. అనారోగ్యానికి గురైన వెంటనే రిమ్స్‌కు తీసుకెళ్లి వైద్యమందేలా చూశారని అక్కడ ఉండి మాకు ధైర్యం చెప్పారని విద్యార్థినులు సమాధానం ఇచ్చారు. విశాఖ నుంచి వచ్చిన విద్యార్థిని తల్లి స్పందిస్తూ తమ పిల్లలను కన్నవారిలా చూసుకున్నారని తెలిపారు. ఆర్డీవో మధుసూధన్, వైస్‌ఛాన్సలర్ సుధాకర్ హాస్టలు విద్యార్థుల కోసం తయారు చేసిన ఆహారం తిన్నారు. ఆహారం రుచికరంగా ఉన్నాయంటూ ఆర్డీవో వ్యాఖ్యానించారు. యూనివర్శిటీ అభివృద్ధి కోసం వైస్‌ఛాన్సలర్ కొన్ని ప్రతిపాదనలు చేయగా రెవెన్యూ పరిధిలో తప్పక చేస్తామని తెలిపారు, నీరు ఆహార పదార్థాలు టెస్టింగుకు పంపామని, నివేదిక రావాల్సి ఉందని వీసీ ఆర్డీవోకు తెలిపారు.



హాస్టల్‌లో భోజనం చేస్తున్న ఆర్డీవో, వైవీయూ వీసీ

బ్రౌన్ లైబ్రరీని బతికించండి

వైస్ చాన్సలర్‌కు జానమద్ది విజయభాస్కర్ లేఖ

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 25 : సీపీ బ్రౌన్ లైబ్రరీని బతికించాలని బ్రౌన్ గ్రంథాలయ సలహా మండలి సభ్యుడు జానమద్ది విజయభాస్కర్ వైవీయూ వైస్‌చాన్సలర్‌కు శనివారం లేఖ రాశారు. వైస్‌చాన్సలర్‌కు మూడు నెలల నుంచి బ్రౌన్‌గ్రంథాలయం ఆవరణంలో గోడపై ఉన్న బ్రౌన్ చిత్రం తెలుగులో పూర్తి పేరు రాయించాలని లేఖ రాసినట్లు తెలిపారు. కడప లోక్ అదాలత్ జడ్జి ఉత్తర్వుల మేరకు పుస్తకాల డిజిటలైజీకరణకు దాదాపు రూ.4 లక్షలతో కొన్నారని దానిని ఇప్పుడు మూలన పడేశారన్నారు. పలుమార్లు దీనిపై లేఖ రాసినా ఎటువంటి స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. ఫిబ్రవరి 28న తమ తండ్రి దశమ వర్ధంతిని ఎలాంటి ఖర్చులు సభా సమావేశం ఆర్భాటం లేకుండా సాధారణంగా జరపాలని ఆ ఖర్చులు మొత్తాన్ని పైన తెలిపిన పనులకు వాడుకోవాలని కోరినట్లు తెలిపారు.

దశాబ్దాల కాలం నాటి దారి మూసేస్తారా?

● పక్కకు తీయకుంటే ప్రజాగ్రహం తప్పదు ● క్రాసింగ్ వద్ద కాంక్రీటు గడ్డర్ల ఏర్పాటుపై పుత్తా ఆగ్రహం





గడ్డర్ల ఏర్పాటుతో చెన్నూరు క్రాసింగ్ వద్ద ఆగిన వాహనాలు, నిలిచిన ప్రజలు.. సీఐతో మాట్లాడుతున్న మైనార్టీ నేతలు.. ఎక్సకవేటరుతో గడ్డర్లను తొలగిస్తున్న దృశ్యం

చెన్నూరు, ఫిబ్రవరి 25 : చెన్నూరు ప్రధాన ఊరిలోకి ఎన్నో దశాబ్దాలుగా ఉన్న దారికి అడ్డంగా టోల్‌ప్లాజా సిబ్బంది కాంక్రీటు గడ్డర్లు ఏర్పాటు చేశారు. దీంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలిసిన టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి అక్కడికి చేరుకున్నారు. ఆ గడ్డర్లు వెంటనే తొలగించాలని టోల్‌ప్లాజా సిబ్బందికి చెప్పారు. చాలా కాలం క్రితం చెన్నూరు ప్రధాన గ్రామంలోకి ట్రంకు రోడ్డు ఉండేది. కాలక్రమేణా ఈ దారి ఆర్అండ్‌బీ రోడ్డుగా మారింది. ప్రస్తుతం ఉన్న ఫోర్‌లేన్ రోడ్డు రాక ముందే పాత రోడ్డు కడప - కర్నూలు రోడ్డుగా చెన్నూరు - కొండపేట మీదుగా ఉండేది. దీంతో అప్పట్లో గ్రామం కాస్త చిన్నగా ఉండడంతో ప్రజలు ఇదే దారిన రాకపోకలు సాగించేవారు. 1956లో ఊరికి పడమట వైపు బైపాస్‌రోడ్డు ఏర్పడింది. ఆ తరువాత 2009లో ఫోర్‌లేన్ రోడ్డు దారి తయారైంది. అయితే ఇప్పటికీ చెన్నూరు పాత ఊరి ప్రజలంతా ఇదే క్రాసింగ్ వద్ద నుంచి రాకపోకలు సాగస్తుంటారు. కాగా ఆదివారం ఈ క్రాసింగ్ వద్ద చెన్నూరు పాత ఊరిలోకి వాహనాలుకానీ, ప్రజలు కానీ వెళ్లకుండా అడ్డుగా పెద్ద పెద్ద కాంక్రీటు గడ్డర్లు ఏర్పాటు చేశారు. ఉన్నట్లుండి గడ్డర్లు ఏర్పాటు చేయడంతో అసలు ఏం జరిగిందో ప్రజలకు అర్థంకాలేదు. ప్రజలంతా పెద్ద సంఖ్యలో క్రాసింగ్ ప్రాంతానికి తరలివచ్చారు. ఈ విషయం ఉప్పరపల్లెలో ఓ కార్యక్రమానికి హాజరైన టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడికి తెలియడంతో ఆయన హుటాహుటిన క్రాసింగ్ ప్రాంతానికి వచ్చి గడ్డర్ల ఏర్పాటు చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దారి మూస్తే పాత ఊరిలోకి వెళ్లే ప్రజలు, వాహనదారులు ఎలా వెళ్లాలి. పైగా యల్లమ్మ దేవాలయం మీదుగా వెళ్లాలని చెబితే ఆ దారి వెడల్పు తక్కువ, ఏదైనా వాహనం వెళ్లి ఇరుక్కుంటే పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. తక్షణం తొలగిచకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. చివరికి గడ్డను తొలగిస్తామని వారు చెప్పడంతో రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్కడ నుంచి వెళ్లిపోయాడు. మైనార్టీ నేతలు చెన్నూరు సీఐ పార్థసారధితో మాట్లాడుతూ గడ్డర్లను తొలగించేంత వరకు పక్కకుపోయేది లేదని చెప్పడంతో సీఐ దగ్గరుండి గడ్డర్లను తొలగించి రాకపోకలకు అవకాశం కల్పించారు. షబ్బీర్‌హుసేన్, అష్రత్, వారిష్, షఫీ, మంజూర్ అహ్మద్ పాల్గొన్నారు.

మహిళ అని కూడా చూడకుండా వైసీపీ నేతల అవహేళన

● నోటికి అడ్డూఅదుపు లేకుండా మాట్లాడుతున్నారు
● టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి ఆవేదన



సమావేశంలో మాట్లాడుతున్న మాధవీరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 25 : మహిళ అని కూడా చూడకుండా వైసీపీ నేతలు అవహేళన చేస్తున్నారని, వారి నోటికి అడ్డూ అదుపు లేకుండా పోతోందని టీడీపీ కడప నియోజకవర్గ అభ్యర్థి ర్.మాధవీరెడ్డి తెలిపారు. నోటికి అడ్డూఅదుపు లేకుండా మాట్లాడుతున్నారన్నారు. ఆదివారం కడప నగరం 35వ డివిజన్‌లో జరిగిన టీడీపీ సమావేశంలో ఆమె కన్నీటిపర్యంతమై మాట్లాడారు. మహిళలను కించపరిచే విధంగా అసభ్యకరంగా డిప్యూటీ సీఎం అంజద్‌బాషా సోదరుడు అహ్మద్ బాషా మాట్లాడుతున్నారన్నారు. ఇంతవరకు గెలిచిన గర్వంతో ఊగిపోతున్నారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో ఓటమి రుచి చూపిస్తామని చెప్పారు. చంద్రబాబు తనను ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను ప్రకటించినప్పటి నుంచి మరింత ఎక్కువగా మాట్లాడుతున్నారన్నారు. అయితే చంద్రబాబు నమ్మకాన్ని వమ్ము చేయనని కడప నగరంలో టీడీపీ జెండా ఎగురవేస్తానన్నారు. తనపై అవాకులు చవాకులు మాట్లాడితే సహించేదిలేదన్నారు. మహిళలను కించపరిస్తే కడప ప్రజలు తిరగబడతారన్నారు. మానవతాదృక్పథంతో ఆలోచించాలని, ప్రతి ఓటరూ ఆలోచించి ఓట్లు వేయాలని పిలుపునిచ్చారు. మహిళ అని కూడా చూడకుండా అనరాని, వినరాని పదజాలంతో దూషించారని, ఎన్నికల్లో గెలిచి తన సత్తా ఏంటో చాటుకుంటానన్నారు. ఎంత అవమానపరిస్తే అంత గట్టిగా నిలబడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రామచంద్రయ్య, టీడీపీ రాష్ట్ర నాయకులు హరిప్రసాద్, 35వ డివిజన్ టీడీపీ నాయకులు లయన్ మన్సూర్‌ఖాన్, జావీదుతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్యం చేస్తున్న డాక్టర్ మహబూబ్ ఆలీ

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 25 : కడప నగరం మెడికేర్ ఆసుపత్రిలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించిందని డాక్టర్ మహబూబ్ ఆలీ తెలిపారు. ఈ శిబిరానికి దాదాపు వంద మందికి పైగా హాజరయ్యారన్నారు. అందరికీ ఉచితంగా రూ.3వేలు విలువ గల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు కూడా అందించామన్నారు. ఆరోగ్యకరమైన భోజన ప్రణాళిక కలిగి ఉండాలని సూచించారు. మెడిటనేరియన్ డైట్ లేదా డాష్ డైట్‌ను అనుసరించాలన్నారు. ఈ ఆహారాల్లో పోషకాలు ఫైబర్ అధికంగా ఉంటాయని, అయితే కొవ్వు కేలరీలు తక్కువగా ఉంటాయన్నారు. ప్రతిరోజూ 30 నిమిషాలు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలన్నారు. నడవడం, ఈత కొట్టడంవంటివి చేయాలని తెలిపారు. అధిక బరువు కలిగి ఉంటే తప్పనిసరిగా బరువు తగ్గాలని ఆరోగ్యం సరక్షణ బృందంతో బరువు తగ్గించే ప్రణాళికలను రూపొందించాలన్నారు. రక్తంలో గ్లూకోజ్, రక్తపోటు స్థాయిలను క్రాస్ చేయాలన్నారు. డాక్టరు నిర్దేశించిన విధంగా ఆరోగ్య సంరక్షణ చేస్త చాలా వ్యాధులను అదుపులో ఉంచవ్చన్నారు. ఈ వైద్య శిబిరంలో మెడికేర్ సిబ్బంది ఆయేషా, గౌతమి, భార్గవి, శిరీషారెడ్డి, వైష్ణవి, సువర్ణ, మౌళాలి, పఠాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎద్దుల కొండ్రాయుడికి వెండి ఆభరణాలు



వెండి ఆభరణాలను అందిస్తున్న లక్కిరెడ్డిపల్లెవాసులు

వేంపల్లె, ఫిబ్రవరి 25: పాపాఘ్నినది ఒడ్డున వెలసిన శ్రీలక్ష్మీ వృషబాచలేశ్వర స్వామి దేవస్థానంలోని ఎద్దుల కొండ్రాయుడికి 850 గ్రాముల వెండి ఆభరణాలను అందజేశారు. ఆదివారం అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లెకు చెందిన భక్తుడు సగళా నాగిశెట్టి, కన్యాకుమారి దంపతుల కుమారుడు భరత్‌కుమార్ సతీమణి శ్రావణి స్వామివారికి వెండి ఆభరణాలను ఆలయ అర్చకుడు హరి ప్రవీణ్‌కు అందించారని ఆలయ ఈఓ శ్రీదర్ తెలిపారు. అనంతరం దాతలకు ప్రత్యేక దర్శనం చేయించి శాలువతో సత్కరించారు.

'టీడీపీతోనే సామాజిక న్యాయం'

చెన్నూరు, ఫిబ్రవరి 25:తెలుగుదేశం పార్టీ తోనే సామాజిక న్యాయం సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మన్నూరు అక్బర్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొదటి విడతగా 99 మంది ఎమ్మెల్యే అభ్యర్థులు ఉమ్మడిగా ఎంపిక చేయగా అందులో 18 మంది బీసీ అభ్యర్థులు, 20 మంది దళిత అభ్యర్థులు, ముగ్గురు ఎస్టీ గిరిజన అభ్యర్థులు, ఒక మైనార్టీ అభ్యర్థి మిగిలిన వారు ఇతరులన్నారు. ఇందులో మేధావి వర్గానికి చెందిన వారు రిటైర్ ఐఏఎస్, పీహెచ్‌డి, పీజీ, గ్రాడ్యుయేట్లు, డాక్టర్లు ఉన్నారని ఆయన అన్నారు. దీంతో టీడీపీలో సామాజిక న్యాయం జరిగిందన్నారు. మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, తెలుగు యువత జిల్లా కార్యదర్శి పవన్‌కుమార్‌రెడ్డి, బీసీ సెల్ నాయకులు గోవిందు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీజేఏసీ నిర్ణయం సరైంది కాదు: యూటీఎఫ్

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 25 : లక్షలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలకు అనుగుణంగా నిలబడి పోరాటం చేయాల్సిన ఏపీ జేఏసీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టతా సాధించకుండానే ఫిబ్రవరి 27న జరిగే చలో విజయవాడ పిలుపును వాయిదా వేయడం సరైంది కాదని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 27న జరిగే చలో విజయవాడ కార్యక్రమానికి పోలీసులు అడ్డగిస్తారని మూడురోజులు ముందే విజయవాడ చేరినట్లు తెలిపారు. అయితే ఏపీ జేఏసీ ఏకపక్షంగా చలో విజయవాడ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించడం ఉద్యోగ, ఉపాధ్యాయ ఆకాంక్షలను నీరుగార్చేవిధంగా ఉందని పేర్కొన్నారు. పీఎఫ్, ఏపీజీఎల్ఐ తదితర ఆర్థిక బకాయిలు రూ.20వేల కోట్లపై ప్రభుత్వం ఏ విధంగా స్పష్టత ఇవ్వకుండా మినిట్స్ జారీ చేసిందన్నారు. దీంతో పాటు మరికొన్ని సమస్యలపై ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమాన్ని ఏపీ జేఏసీ వాయిదా వేయడాన్ని యూటీఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. సమస్యల పరిష్కారం అయ్యేంతవరకు పోరాటం సాగించాలన్నారు. జేఏసీ పోరాటం కొనసాగించని పక్షంలో ఉద్యోగ, ఉపాధ్యాయ పక్షాన యూటీఎఫ్ ఒంటరిగానైనా పోరాడుతుందన్నారు.

పటిష్టమైన ఎన్నికల నిర్వహణ
ఎన్నికల కమిషన్ బాధ్యత

● అఖిల భారత అభ్యుదయ వేదిక

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 25 :పటిష్టమైన ఎన్నికల నిర్వహణ ఎన్నికల కమిషన్ బాధ్యత అని అఖిల భారత అభ్యుదయ వేదిక రాష్ట్ర కార్యదర్శి కెసురేష్‌బాబు తెలిపారు. ఆదివారం ఎస్టీయూ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో ఎటువంటి లోటుపాట్లకు ఆస్కారం లేకుండా తగిన నిర్వహణపరమైన ఏర్పాట్లను సంబంధిత అధికారులు చేయాలని చెప్పారు. ఎన్నికలు ప్రజాస్వామ్యానికి శ్రీరామ రక్ష అని, ఎన్నికల నిర్వహణ న్యాయబద్ధంగా జరిగినప్పుడే నిజమైన ప్రజాభిప్రాయం తెలియవస్తుందన్నారు. అధికారులు వివిధ రాజకీయ పార్టీల వారు చిత్తశుద్ధితో రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో నిజాయితీగా పాల్గొనాలని కోరారు.
జిల్లా అధ్యక్షులు బి.విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శి శంకరయ్య మాట్లాడుతూ ఎన్నికల్లో ఓట్లుకు డబ్బు పంపిణీ చేయడం, పోలింగ్ సమయంలో దౌర్జన్యాలు జరగడం వంటివి లేకుండా పోలీసులు తగిన చర్యలు చేపట్టాలని కోరారు. అభ్యుదయ వేదిక ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

టీడీపీలోకి ప్రాజెక్ట్ కాలనీవాసులు



యువకులతో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 25: కడప నగరం రెండో డివిజన్ చలమారెడ్డిపల్లె హిల్‌వాలీ తులసీ ప్రాజెక్ట్ కాలనీకి చెందినవారు టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఎల్.చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు యువకులు పార్టీలో చేరడంతో ఆ ప్రాంతంలో రానున్న పార్టీ మరింత బలం పుంజుకున్నట్లయింది. కార్యక్రమంలో ఆర్.చంద్రఓబుల్‌రెడ్డి, చల్లా సుధాకర్, చల్లారాజా, ఎన్. మనోజ్‌కుమార్, ఎస్. మహ్మద్‌రఫీ, మౌళాలి, నంద్యాల రవికుమార్, బత్తల శ్రీనివాసులు, వెంకటరమణ, ఆర్.శ్రీకాంత్, వి. తేజ, ఎన్.పెంచలయ్య పాల్గొన్నారు.

'రాజకీయ ప్రాధాన్యత కల్పించండి'

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 25: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పాలక, ప్రతిపక్ష పార్టీలు తొగటవీర క్షత్రియులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించేలా ఎమ్మెల్యే, ఎంపీ సీట్లను కేటాయించాలని తొగటవీర క్షత్రియ సంక్షేమ సంఘం నగర అధ్యక్షుడు కళ్యా సుధాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం తొగట వీరక్షత్రియ సంక్షేమ సంఘం నగర శాఖ నూతన కమిటీ ఎన్నిక అనంతరం సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సూర్యనారాయణ అధ్యక్షతన జరిగింది.

నగర నూతన కమిటీ ఎన్నిక

సమావేశ అనంతరం తొగట వీరక్షత్రియ సంక్షేమ సంఘం నగర నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఇందులో అధ్యక్షుడిగా కళ్యా సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా పి. నరసింహారావు, కోశాధికారిగా టి.సుదర్శన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సుబ్రమణ్యం, కార్యనిర్వాహక కార్యదర్శిగా పి.మురళీకృష్ణయ్య, గౌరవ సలహాదారులుగా బి. శ్రీనివాసులు, ఎస్.కొండయ్య, గంజికుంట రఘురామయ్య, పి. రెడ్డయ్య, పి. శంకర్, సి.లక్ష్మీనారాయణ, గౌరవాధ్యక్షుడు ఎస్.రామచంద్రుడు, డాక్టర్ పల్లా భాస్కర్, గోవిందు నాగరాజు, సహాయకార్యదర్శులుగా ఎం.సుబ్బరాయుడు, సిఆర్ఐ సునీల్ జయంత్, తదితరులున్నారు.

టీడీపీతో ఇంటింటికీ సంక్షేమం



మాట్లాడుతున్న భరత్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి

చక్రాయపేట, ఫిబ్రవరి 25: తెలుగుదేశం పార్టీ ద్వారా ఇంటింటికి సంక్షేమం దక్కుతుందని టీడీపీ నాయకులు ప్రజలతో అన్నారు. ఆదివారం మండంలోని సురభి లక్ష్మీపురం, పాయలోపల్లె, కుప్పగుట్టపల్లె, బోడుగుండుపల్లె, మహబూబ్‌నగర్‌లలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పులివెందుల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవి సోదరుడు భరత్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి మహేశ్వర్‌రెడ్డి ఇంటింటికి తిరుగుతూ టీడీపీ-జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలోని పథకాలను వివరించారు. కుటుంబానికి ఎంత లబ్ధిచేకూరుతుందో వివరించారు.

విజయదుర్గా ఆలయంలో బ్రహ్మోత్సవ శోభ



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కడప (కల్చరల్), ఫిబ్రవరి 25: బ్రహ్మోత్సవాల శోభతో నగర బిల్టప్ సమీపంలోని విజయదుర్గాదేవి ఆలయం రంగురంగుల విద్యుత్ దీపాల వెలుగులలో కాంతులీనుతోంది. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న కార్యక్రమాలు నిర్విఘ్నంగా సాగుతున్నాయి. ఆదివారం అమ్మవారికి విశేష పంచామృత అభిషేకం చేశారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ మండపంలో పండితులు శ్రీ చక్రార్చనలు నిర్వహించారు. యాగశాలలో విజయదుర్గా హోమం, గణపతి హోమం, చండీహోమం ఆలయ నిర్వాహకులు దుర్గాప్రసాద్, దంపతులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాత్రి 8 గంటలకు విజయదుర్గా, మల్లికార్జునులు వృషభవాహనంపై ఆలయ ప్రదక్షిణ గావించారు.
నేడు అమ్మవారి కల్యాణం: సోమవారం అమ్మవారి కల్యాణం నిర్వహించనున్నారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ వారిచే భక్తి గానలహరి, పండితుల దివ్య పలుకులు, వేద పండితుల వేదమంత్రాల నడుమ కల్యాణం జరగనున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు మల్లికార్జునరావు తెలిపారు. కావున భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఆ తల్లి దీవెనలు పొందాలని కోరారు.

గిడ్డంగివారిపల్లె చెరువుకు నీటి సరఫరా

వేంపల్లె, ఫిబ్రవరి 25: మండలంలోని మారుమూల గ్రామంలో గిడ్డంగివారిపల్లె చెరువుకు పులివెందుల బ్రాంచ్ కెనాల్‌కు నీటి సరఫరా ప్రారంభించారు. కాల్వ నీటిని నాలుగు మోటర్ల ద్వారా పంపింగ్ చేస్తూ చెరువుకు తరలించారు. ఆదివారం రాత్రి మోటర్లను ఆన్ చేసి నీటిని పంపింగ్ చేశారు. పీబీసీ కాల్వ పొడవున గడ్డి, జమ్ము పేరుకుపోవడంతో ఎంపీ అవినాష్‌రెడ్డి రూ.20లక్షలకు పైగా నిధులు వెచ్చించి శుభ్రం చేయించారు. దీనితో కాల్వకు నీరు సక్రమంగా సరఫరా కావడంతో చెరువుకు నీటిని సరఫరా చేసే అవకాశం కలిగిందని జడ్పీటీసీ రవి కుమార్‌రెడ్డి తెలిపారు. సహకరించిన ఎంపీకి, పీబీసీ అధికారులకు గిడ్డంగివారిపల్లె, బక్కన్నగారిపల్లె గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా బొజ్జ తిరుమలేశ్



కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 25 : టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా బొజ్జ తిరుమలేశ్‌ను నియమిస్తూ టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యాలయం ఆదేశాల మేరకు టీఎన్ఎస్ఎఫ్ విధి విధానాలకనుగుణంగా విధులు నిర్వహించాలని టీడీపీ అభివృద్ధికి, అలాగే విజయానికి కృషి చేయాలని ఆయన సూచించారు. తిరుమలేశ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించినందుకు ధన్యావాదాలు తెలిపారు.

'అవినీతి పాలనకు స్వస్తి పలకాలి'

సింహాద్రిపురం, ఫిబ్రవరి 25: రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి, అరాచక పాలనకు చరమగీతం పాడాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సింహాద్రిపురం పట్టణంలో బీజేపీ నిర్వహిస్తున్న ప్రజాపోరులో భాగంగా ఆయన మాట్లాడారు. మోదీ పథకాలను వివరించారు. బీజేపీ నాయకులు శ్రీనాథరెడ్డి, శ్రీనివాసరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

చదువులమ్మ సిగలో నగలు...
ఏడు పదుల వయస్సులో ఒక్కటయ్యారు



సింహాద్రిపురం ప్రభుత్వ పాఠశాలలో 1967-68లో పదవ తరగతి చదివిన విద్యార్థులు

సింహాద్రిపురం, ఫిబ్రవరి 25: వారంతా ఏడు పదుల వయస్సు దాటిన వారు.. ఏభై ఏడు ఏళ్లప్పుడు పదో తరగతి చవివారు. ఇన్నేళ్ల తర్వాత అందరూ కలిసి తాము చదువుకున్న పాఠశాల లో కలిశారు. చదువుల అనంతరం పలు రంగాల్లో ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. నాడు చదువుకున్న వారిని కలవాలనే కొందరి ఆలోచన నేడు కార్యరూపం దాల్చింది. ఏకంగా 100 మందికి పైగా ఎస్ఎస్ఎల్‌సీ విద్యార్థులు పాఠశాలలో ఆదివారం కలుసుకున్నారు. సింహాద్రిపురం జడ్పీ హైస్కూల్లో 1967-68లో పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు అదేపాఠశాలలో చదువుకొని సింహాద్రిపురంలో స్థిరనివాసం ఏర్పరచుకున్న అరవిందనాథరెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకొన్నారు. దాదాపు 60సంవత్సరాల క్రితం చదువుకున్న పాఠశాలల కలుసుకున్న ఆ విద్యార్థులు ఒకరినొకరు చూసుకుంటూ పాత జ్ఞాపకాలను నెమరువేసుకొంటూ సంతోషంగా గడిపారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, కుటుంబ నేపథ్యం తెలుసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ రోజు ఎన్నటికి మరువలేమని చిన్ననాటి స్నేహితులను మళ్లీ కలుసుకుంటామని కలలో కూడా ఊహించలేదని పలువురు గద్గదస్వరంతో మాట్లాడారు. గ్రూప్‌ఫోటోలు తీసుకొని సంతోషపడ్డారు. అలాగే ప్రస్తుత హెచ్ఎం వీరనారాయణరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ ఆనందం బతికినంత కాలం ఉంటుందని వీడ్కోలు పలికారు.

ఆత్మీయ సమ్మేళనం ఆనందాన్నిచ్చింది



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. ఆహ్వానించిన వెంటనే అందరం ఇలా కలుసుకోవడం చాలా సంతోషంగా ఉంది. మాకు చదువు చెప్పిన గురువును ఇన్నేళ్ల తర్వాత కూడా సన్మానించే అవకాశం దక్కడం పూర్వజన్మ సుకృతం.
- అరవిందనాథరెడ్డి, పూర్వ విద్యార్థి, సింహాద్రిపురం జడ్పీ ఉన్నత పాఠశాల



నాటి ఉపాధ్యాయుడు వీరనారాయణరెడ్డిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

మల్లాలమ్మ కృప అందరిపై ఉండాలి: పుత్తా



టీడీపీ నేతలతో పుత్తా నరసింహారెడ్డి

చెన్నూరు, ఫిబ్రవరి 25 : మల్లాలమ్మ కృప అందిరిపై ఉండాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కొండపేట గ్రామంలో టీడీపీ తెలుగుయువత ఉపాధ్యక్షుడు సంజీవ పవన్, వారి కుటుంబ సభ్యులు బంధువులు వారి గ్రామ దేవత మల్లాలమ్మకు ఆదివారం మొక్కుబడులు నిర్వహించారు. అమ్మవారికి జంతుబలులు సమర్పించడంతో పాటు గ్రామ ప్రజలకు విందు భోజనం ఏర్పటు చేశారు. కార్యక్రమానికి హాజరైన టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుటుంబ సభ్యులందరినీ అభినందించారు. అంతేకాక ఎన్నో ఏళ్లుగా ఈ కొండపేట బీసీ (మేదర) కుటుంబాలు టీడీపీకి అండగా ఉన్నాయని, వారందరి బాగోగులు చూసుకుంటామన్నారు. తెలుగు యువత నేత కుటుంబ సభ్యులతో పాటు టీడీపీ నేతలు టంగుటూరు పెద్ద సంజీవరాయుడు, చిన్న సంజీవరాయుడు, సంజీవ్‌పవన్, చరణ్, మండల కన్వీనరు విజయభాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి, జిల్లా బలిజ సంఘ నేతలు ఆకుల ప్రసాద్‌బాబు, మాజీ ఎంపీపీ శివరామరెడ్డితో పాటు పలువురు బీసీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన పుత్తా

సీకేదిన్నె, ఫిబ్రవరి 25: తెలుగుదేశం పార్టీ కార్యకర్త మాచిరెడ్డి ప్రతాప్‌రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఆదివారం మృతిచెందాడు. ఆ కుటుంబాన్ని కమలాపురం ఇన్‌చార్జి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి పరామర్శించారు. గత నాలుగు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడిన ప్రతాప్‌రెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులను చింత కొమ్మదిన్నె మండలం తాడిగొట్ల గ్రామంలో మృతదేహానికి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ అన్నివిధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఓబుళరెడ్డి, శ్రీనివాసపులు, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీ విజయానికి కృషి చేయండి

కడప పార్లమెంట్ అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసరెడ్డి



శ్రీనివాసరెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు,ఫిబ్రవరి 25 : రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త, నాయకుడు పని చేయాలని టీడీపీ కడప పార్లమెంట్ అధ్యక్షుడు రెడ్డప్పగారి శ్రీనివాసులరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కడప పార్లమెంట్ అధ్యక్షుడుగా ఎన్నికైన తొలిసారి ప్రొద్దుటూరుకు విచ్చేసిన సందర్భంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి శ్రీనివాసులరెడ్డిని గజమాలతో సత్కరించారు. వైసీపీ అరాచక పాలనను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. టీడీపీకి అనుకూల పవనాలు వీస్తున్న సందర్భంగా జిల్లాలో సత్తా చాటడానికి ప్రతి కార్యకర్త, నాయకుడు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఈవీ సుధాకర్ రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు వైఎస్ జబీవుల్లా , మండల టీడీపీ కన్వీనర్ బాబుల్‌రెడ్డి, రాజుపాళెం మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ బండిభాస్కర్‌రెడ్డి, 22 వవార్డు కౌన్సిలర్ మహ్మద్‌గౌస్, మాజీ కౌన్సిలర్ సీతారామిరెడ్డి, ప్రొద్దుటూరు నియోజకవర్గ కార్యకర్తలు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో టీడీపీ జెండా ఎగురవేద్దాం

నియోజకవర్గ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి



పార్టీలోకి కండువాకప్పి ఆహ్వానిస్తున్న భూపేశ్‌రెడ్డి

పెద్దముడియం, ఫిబ్రవరి 25 : రాబోవు ఎన్నికల్లో జమ్మలమడుగు నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగరవేద్దామని ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని భూతమాపురం, కొండసుంకేసుల గ్రామాల్లో సుమారు వంద కుటుంబాలు భూపేశ్‌రెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. భూతమాపురంలో గ్రామానికి చెందిన శివారెడ్డి, పార్థసారధిరెడ్డి, శంకర్‌రెడ్డి, లక్ష్మీనారాయణెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, హరికిరణ్‌రెడ్డి, శ్రీనాథరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సంజీవ, పెద్దయ్య, శ్యామ్యూల్, సాంబయ్య కొండ సుంకేసుల గ్రామంలో కోట వెంకటేశ్వర్‌రెడ్డి, కోట శివశంకర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, భూమిరెడ్డి చెన్నారెడ్డి, భూమిరెడ్డి నాగిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, శివారెడ్డి, మారం వెంకటసుబ్బారెడ్డి, సుబ్బారెడ్డి, దుగ్గం భువనశ్వర్‌రెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

'అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన జగన్'

జమ్మలమడుగు, ఫిబ్రవరి 25: అన్ని వర్గాలను మోసం చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఎన్నికల్లో ప్రజలు ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పాలని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి దేవగుడి భూపేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. అంభాభవానీ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి ఆయన మొక్కుకున్నారు. అక్కడి నుంచి ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రకటించిన సూపర్-6 పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించారు.కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో పూజలు చేసి మొక్కుకున్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు మల్లెంకొండు సుబ్రమణ్యం ఆలయంలోకి ఘనంగా ఆహ్వానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ శివనాథరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, దేవగుడి యూత్ బృందం, బాలపుల్లారెడ్డి, సుదర్శన్ రెడ్డి, జగదీష్, గ్రంథే శ్రీను, దాదాపీర్, నాగార్జున, మదార్‌వలి, పవన్, సుధీర్, పతంగి హేమంత్, ఎంకోబారావు, ఖలందర్, షామీర్, వినయ్, షబ్బీర్, భాగ్యమ్మ పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి వంద కుటుంబాలు చేరిక



రామాయపల్లెలోవైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 25 : వైసీపీ నుంచి వంద కుటుంబాల వారు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ సమక్షంలో టీడీపీలో చేరారు. ఆదివారం రాత్రి పోరుమామిళ్ల మండలంలోని రామాయపల్లె, రామాయపల్లె ఎస్సీ కాలనీ, ఎస్టీ కాలనీకి సంబంధించి వంద కుటుంబాల వారు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే విజయమ్మ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ తీరుపై ప్రజలంతా విసిగిపోయారన్నారు. కార్యక్రమానికి ముందుగా టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ రామచంద్రయ్యను సన్మానించారు. మండల అధ్యక్షుడు మస్తాన్, మౌలాలి రంతుల్లా, సర్పంచ్ యనమల సుధాకర్, మండల పార్టీ అధ్యక్షుడు నగిరి భైరవ ప్రసాద్. విజయకుమార్, సీతా వెంకటసుబ్బయ్య, రామసుబ్బారావు, మల్లికార్జునరెడ్డి, ఇమాంహుస్సేన్, రామసుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా వినోద్‌బాబు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 25: జమ్మలమడుగు మండలం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా సుగ్రీవ వినోద్‌బాబు నూతన అధ్యక్షుడుగా ఎన్నికయ్యాడు. ఆదివారం వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో ఆలయ ట్రస్టీలు కర్నాటి జనార్దన్, ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు మల్లెంకొండు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నూతన ఎన్నిక నిర్వహించారు. మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడుగా సుగ్రీవ వినోద్‌బాబు ప్రమాణస్వీకారం చేశారు. ప్రధాన కార్యదర్శి ఆత్మకూరు అనిల్‌కుమార్, కోశాధికారి కొప్పరపు సునీల్‌కుమార్, ఉపాధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ మాజీ అధ్యక్షుడు చరణా వెంకటకిషోర్, లక్ష్మీనారాయణ, ముద్దనూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కె.సుధాకర్, చక్రపాణి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాశినాయన ఆరాధన మహోత్సవం



అల్లూరి సీతారామరాజు వేషధారణలో పుల్లారెడ్డి

ముద్దనూరు ఫిబ్రవరి25: మండల పరిధి మంగపట్నం కొండలోని సిద్ధలింగేశ్వరస్వామి కోనలో వెలసిన అవధూత కాశిరెడ్డినాయన ఆశ్రమంలో శనివారం రాత్రి పున్నమి ఆరాధన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విశ్రాంత అధ్యాపకులు బూచుపల్లె పుల్లారెడ్డి ఆయన తల్లిదండ్రులు క్రీ.శే. బూసిరెడ్డి, పార్వతమ్మల జ్ఞాపకార్థం పలు పౌరాణిక నాటకాలు నిర్వహించారు. బూచుపల్లె పుల్లారెడ్డి వేసిన అల్లూరి సీతారామరాజు వేషధారణ ఎంతగానో అలరించింది. భక్తులు పాల్గొని కాశిరెడ్డి నాయనను దర్శించుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

యథేచ్ఛగా ఫుట్‌పాత్‌ల ఆక్రమణ

● రోడ్లపైనే వ్యాపారం ● పాదచారులకు ఇక్కట్లు ● ట్రాఫిక్‌కు అంతరాయం ● బద్వేలులో ఇదీ పరిస్థితి



ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన దుకాణాలు

బద్వేలు టౌన్, ఫిబ్రవరి 25 : బద్వేలు పట్టణంలో రోజురోజుకూ జనం రద్దీ పెరుగుతోంది. వాహనాల తాకిడి ఎక్కువైంది. రోడ్లపై అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితిగా తయారైంది. దుకాణదారులు ఫుట్‌పాత్‌లను సైతం ఆక్రమించి అక్కడే సరుకులు, హోటళ్లు పెట్టుకుని వ్యాపారాలు నిర్వహిస్తుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. పాదచారులు ఫుట్‌పాత్‌లపై నడవాలంటే దారి అసలే ఉండడం లేదు. ఫుట్‌పాత్ వ్యాపారాలు చేసేవారు. పాదచారుల కోసం కేటాయించిన ఫుట్‌పాత్‌లు వ్యాపారుల హస్తాల్లో ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బద్వేలు పట్టణం రోజురోజుకూ అభివృద్ధి చెందుతుండడంతో హోటళ్లు, దుకాణాలు ఇతరత్రా వ్యాపారాలు ఫుట్‌పాత్‌ల పైనే పెట్టి నిర్వహిస్తుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. అయితే అందుకు తగ్గట్లుగా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.



నడిచేందుకు వీలు లేకుండా వాహనాల పార్కింగ్

రద్దీ పట్టణం..: పట్టణంలో అత్యంత రద్దీగా ఉండే నాలుగురోడ్ల కూడలి, నెల్లూరు రోడ్డు జాతీయ రహదారి, మైదుకూరు రోడ్డు జాతీయ రహదారి, సిద్దవటం రోడ్డు, పోరుమామిళ్ల రోడ్డులో ఫుట్‌పాత్‌లను పూర్తిగా ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తుండడంతో ప్రజలకు నడిచేందుకు కూడా వీలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పండుగ సమయాల్లో అయితే రహదారులన్నీ కిక్కిరిసిపోతాయి. మిగతా రోజుల్లో కూడా బద్వేలు పట్టణం ఎప్పుడూ కిటకిటలాడుతుంటుంది. అలాంటి పట్టణంలో ఫుట్‌పాత్‌లు ఆక్రమణలో ఉండడంతో ప్రజలు అవస్థలు పడాల్సి వస్తోంది. పాదచారులు నడవడానికి వీలు లేకుండా ఉండడంతో రోడ్లపై రాకపోకలను సాగించాల్సి వస్తోంది. దీంతో ప్రజలు ప్రమాదాల బారిన పడి క్షతగాత్రులుగా మిగులుతున్నారు. ఫుట్‌పాత్‌లు ఆక్రమించడమే కాకుండా నిబంధనలకు విరుద్ధంగా దుకాణదారులు ఫ్లెక్సీలు అడ్డంగా కట్టడంతో మరింత ప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఉంది. ఆయాశాఖల అధికారులు ఫుట్‌పాత్‌లలో ఆక్రమణలు తొలగించడంలేదు. ఏదైనా జరిగితే హడావిడి చేసి తరువాత యథాతథంగా గాలికి వదిలేస్తున్నారు. కొంత మంది దుకాణదారులకు దుకాణాలకు సెల్లార్లు ఉన్నప్పటికీ ఆ సెల్లార్లు వాడకుండానే రహదారులపైన వాహనాలు నిలిపివేస్తున్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కొందరు హోటల్, దుకాణ వ్యాపారులు ఫుట్‌పాత్‌లపైనే వ్యాపారాలు నిర్వహిస్తుండడంతో ఉదయం. సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ స్తంభిస్తోంది. వాహనాలకు రాకపోకలకు ఇబ్బంది కలుగుతుంది. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి తిరిగి వెళ్లే ప్రయాణికులు మరింత ఇబ్బందులు పడాల్సి వస్తోంది. నాలుగురోడ్లలో సాయంత్రం వేళ రోడ్లన్నీ కిటకిటలాడుతుండడంతో ప్రజలు నడవడానికి వీలు లేకుండా ఉండడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రోడ్లపైన ఫుట్‌పాత్‌లపై దుకాణాలు పెట్టి అమ్మకాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకుని ఆక్రమణలను తొలగించాలని ప్రజ లు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాల్సి ఉంది.

చర్యలు తీసుకుంటాం

ఫుట్‌పాత్ ఆక్రమణలపై మా దృష్టికి వస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే సిబ్బందితో నిత్యం పట్టణంలో పర్యటిస్తున్నాం. ఫుట్‌పాత్ ఆక్రమణలను దశల వారీగా తొలగించేందుకు చర్యలుచేపడతాం. నూతనంగా బాధ్యతలు చేపట్టడం వల్ల ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు ఇంకా మా దృష్టికి రాలేదు. త్వరలోనే తొలగించి ఫుట్‌పాత్‌లను పాదచారులకు ఇబ్బంది లేకుండా వాడుకలోకి తీసుకువస్తాం.

● కృష్ణ, మున్సిపల్ కమిషనర్

'భూపేశ్‌రెడ్డిని ఆదరిద్దాం'



మాట్లాడుతున్న టీడీపీ నేతలు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 25: జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి దేవగుడి భూపేశ్‌రెడ్డికి బీసీలతోపాటు అందరు నాయకులు మద్దతు తెలపాలని బీసీ నాయకుడు యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శి, తెలుగుయువత జిల్లా అధికార ప్రతినిధి నేట్లపల్లి శివరాం పిలుపునిచ్చారు. ఆదివారం జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదటివిడతలో అత్యధిక బీసీ అభ్యర్థులను చంద్రబాబు ప్రకటించారన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సుబ్బరాజా, చేనేత జాతీయ ఐక్యవేదిక సంఘ పట్టణాధ్యక్షుడు వెంకటకృష్ణయ్య, తెలుగురైతు కార్యనిర్వాహక కార్యదర్శి లక్షుమయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జీవీ సత్రం మీదుగా బ్రహ్మంగారిమఠానికి ఆర్‌టీసీ బస్సు

మైదుకూరు రూరల్, ఫిబ్రవరి 21 : పవిత్ర పుణ్యక్షేత్రం బ్రహ్మంగారిమఠానికి మండలంలోని జీవీ సత్రం,మాచుగారిపల్లె మీదుగా ఆదివారం నుంచి ఆర్‌టీసీ బస్సును నడుపుతున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాసరావు, ఆర్‌టీసీ ట్రాఫిక్ ఇన్‌చార్జ్ విజయమ్మ, కంట్రోల్ ఏడీసీ లక్ష్మయ్య పేర్కొన్నారు.ప్రతిరోజు మైదుకూరు బస్‌స్టాండ్ నుంచి ఉదయం 5గంటల 45 నిమిషాలకు, సాయంత్రం 4 గంటలకు ఇలా ప్రతి రోజు రెండు సార్లు మైదుకూరు నుంచి బస్సు వెళుతుందని తెలిపారు.జీవీ సత్రం పరిధిలోని ప్రయాణికులు బ్రహ్మంగారిమఠానికి వెళ్లాలంటే మైదుకూరుకు వచ్చి వెళ్లాల్సి ఉండేదని, ఇప్పుడు నేరుగా జీవీ సత్రం నుంచే ప్రయాణించవచ్చునని వారు తెలిపారు.

నోటీసులు ఇవ్వడం దారుణం

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 25 : ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించమని కోరితే పోలీసులు నోటీసులు ఇవ్వడం దారుణమని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 27న ఉద్యోగ, ఉపాధ్యాయుల చలో విజయవాడ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఆయనకు పోలీసులు నోటీసు ఇచ్చారు.

అస్తవ్యస్తంగా డ్రైనేజీ కాలువల నిర్మాణం



కాలువలో కదలని డ్రైనేజీ నీరు, వ్యర్థాలు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 25: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో పలుచోట్ల డ్రైనేజీ కాలువలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. ముద్దనూరు రోడ్డులోని బ్యాంకు కాలనీ వెళ్లే ప్రధాన రోడ్డుకు డ్రైనేజీ కాలువలోనే విద్యుత్తు స్తంభం, నీళ్ల నిలబడి వ్యర్థాలు శుభ్రం చేయక స్థానికులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. దాని పక్కనే డ్రైనేజీ కాలువ పూడిపోయి నీళ్లు నిలిచి ఉన్నాయి. దీంతో పై భాగంలో బ్యాంకు కాలనీ శివార్లలో ప్రజలకు డ్రైనేజీ నీరు కదలక వ్యర్థాలు నిండి కంపుకొడుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే చర్యలు తీసుకుని కాలువలు శుభ్రం చేయాలని, పూడిపోయిన కాలువల్లో మట్టి తరలించి డ్రైనేజీ నీరు కదిలేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల తనిఖీ



ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో తనిఖీ చేస్తున్న ఎన్‌బీఏ బృందం

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 25 : పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మెకానిక్ విభాగాన్ని ఎన్‌బీఏ బృందం తనిఖీలు ఆదివారం ముగిశాయి. మూడు రోజులుగా బృందం సభ్యులు మెకానికల్ బ్రాంచ్‌కు సంబంధించిన 10 విభాగాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆదివారం మెకానికల్ సిబ్బందితో ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌బీఏ బృందం చైర్మన్ డాక్టర్ రాజీవ్ మాట్లాడుతూ 10 విభాగాల్లో 9 విభాగాలు సంతృప్తిగా ఉన్నాయని, ప్లేస్‌మెంట్స్ విభాగంలో పురోగతి సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జగదీశ్వరుడు మాట్లాడుతూ ఎన్‌బీఏ గుర్తింపు లభిస్తే ప్రాంగణ నియామకాల్లో ఎక్కువ మంది విద్యార్థులకు అవకాశాలు లభిస్తాయని, కేంద్ర ప్రభుత్వం నుంచి రాయితీలు, నిధులు మంజూరవుతాయన్నారు. వచ్చే ఏడాది నుంచి కంప్యూటర్ సైన్స్, ఈసీఈ బ్రాంచ్‌లకు ఈసీఈ తనిఖీలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌బీఏ బృందం సభ్యుడు డాక్టర్ అలీ, మెకానికల్ విభాగం హెచ్‌ఓడీ అశోక్ బాబు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కాశీరెడ్డి శ్రావణ్, అధ్యాపకులు, సురేష్ బాబు, రాజేష్, హరీష్, మురళీ, సునీత, సువర్ణ, జీవరాజ్ పాల్, వరప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సృజనాత్మకను పెంపొందించుకోవాలి



సైన్స్ ప్రతిభా పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 25 : విద్యార్థులు సృజనాత్మక నైపుణ్యం పెంపొందించుకోవాలని ఉపవిద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సర్ సీవీ రామన్ సైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌వీ డిగ్రీ కళాశాలలో పదో తరగతి విద్యార్థులకు సైన్స్ ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. సైన్స్‌క్లబ్ జిల్లా కన్వీనర్ విజయమోహన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే విద్యను అభ్యసించాలన్నారు. ఎంఈఓ సావిత్రమ్మ మాట్లాడుతూ విద్యార్థులు నూతన ఆవిష్కరణలు కనుగొనడానికి కృషి చేయాలన్నారు. అనంతరం ప్రతిభకనబరిచిన విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీషు మీడియాల్లో వేర్వేరుగా బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సీవీ రామన్ సైన్స్ క్లబ్ కార్యదర్శి చంద్రశేఖర్, గౌరవాధ్యక్షుడు గోపినాథరెడ్డి, ఉపాధ్యాయులు రవిప్రకాశ్‌రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, కల్యాణ్‌కుమార్, ఒంటేరు శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

అవినీతి, అరాచక పాలనకు స్వస్తి పలకాలి

సింహాద్రిపురం, ఫిబ్రవరి 25: రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి, అరాచక పాలనకు చరమగీతం పాడాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సింహాద్రిపురం పట్టణంలో బీజేపీ నిర్వహిస్తున్న ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. మోదీ పథకాలను వివరించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వంలో జరుగుతున్న అరాచక, అవినీతి పాలనను ప్రజలకు వివరించారు. మండలంలోని మొగమోరు వాగు కరకట్టల నిర్మాణంలో వైసీపీ నాయకులు కోట్ల రూపాయలు దోచుకున్నారన్నారు. గ్రామీణ ప్రాంతంలో మట్టిరోడ్ల నిర్మాణాలు 20శాతం ఖర్చుచేసి 80శాతం నిధులు కాంట్రాక్టర్ల ముసుగులో వైసీపీ కార్యకర్తలు దోచుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనాథరెడ్డి, శ్రీనివాసరెడ్డి, భానుప్రకాష్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

గర్భ రక్షాంబికాదేవి అలంకారంలో పెద్దమ్మతల్లి



మైదుకూరు రూరల్ ఫిబ్రవరి 24 : పట్టణంలోని పాతూరులో పెద్దమ్మతల్లి వార్షికోత్సవవేడుకలు భక్తులు ఘనంగా నిర్వహిస్తున్నారు. వేడుకల్లో భాగంగా ఆదివారం గర్భ రక్షాంబికాదేవి అలంకారంలో పెద్దమ్మతల్లి దేదీప్యమానంగా వెలిగిపోయారు.తెల్లవారుజాము నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తండోపతండాలుగా వచ్చి పెద్దమ్మతల్లిని దర్శించుకొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనపై కళాజాత

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 25 : రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ విజయవాడ వారి ఆదేశాల మేరకు జిల్లాలో ఎయిడ్స్ నివారణ, నియంత్రణ ద్వారా కళాజాత బృందాలు వీధుల్లో నాటకాల ద్వారా ప్రదర్శనలు ఇచ్చారు. ఆదివారం పోరుమామిళ్లలో రెండు కళాజాత బృందాలతో ఎయిడ్స్ వ్యాధి నిర్మూలన పై నాటకాల ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ శ్రీవాణి, సుధాకర్, చైల్డ్ ఫర్ ఇండియా లింక్ వర్కర్ ఖాదర్‌బాషా, కళాకారులు జయశంకర్, సుధాకర్, అశోక్‌కుమార్, సుధీర్, నాగేంద్ర పాల్గొన్నారు.

ఎయిడ్స్ బాధితులను ఆదరించాలి

ఖాజీపేట, ఫిబ్రవరి 25: ఎయిడ్స్‌వ్యాధిగ్రస్థులను ప్రేమానురాగాలతో ఆదరించాలని లింక్‌వర్కర్స్ స్కీం సూపర్‌వైజర్ దర్బార్ అమీర్‌బాబు అన్నారు. ఆదివారం ఖాజీపేట బస్టాండు కూడలిలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై జయశంకర్ కళాజాత బృందం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎయిడ్స్ రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వచ్చిన తర్వాత ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న దానిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, అశోక్‌కుమార్, నరేష్, సురేష్, భరత్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 25: ఎర్రగుంట్ల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రొద్దుటూరు అభిలాష్ కంటి నేత్ర వైద్యశాల వైద్యులు గురుఅభిలాష్ నేతృత్వంలో సుమారు 90మందికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను కూడా పంపిణీచేశారు. సుమారు 32మందికి కంటి శస్త్రచికిత్స అవసరముందని రెఫర్ చేశారు. అత్యాధునిక వైద్య పరికరాలతో వీరందరికి ఆరోగ్యశ్రీలో ఉచితంగా కంటి ఆపరేషన్ నిర్వహిస్తామని వైద్యులు తెలిపారు. సోమవారం ఎర్రగుంట్లలోని గౌతంస్కూల్ నుంచి ప్రత్యేక వాహనంలో వారిని తీసుకెళ్లి ఆపరేషన్ అనంతరం తిరిగి ఎర్రగుంట్లకు చేరుస్తారన్నారు. అంతకుముందు ఈ వైద్య శిబిరాన్ని మానవత చైర్మన్ రఘురామిరెడ్డి, అధ్యక్షుడు జీరెడ్డి మల్లికార్జునరెడ్డి ప్రారంభించారు. ఈకార్యక్రమంలో రాజవర్ధన్‌రెడ్డి, రాజారెడ్డి, సుబ్బరాయుడు, జక్కు చెన్నక్రిష్ణారెడ్డి, టీచర్స్ రంగయ్య, ఓబయ్య, సతీష్, ప్రభాకర్‌రెడ్డి, సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని అధిక మెజార్టీతో గెలిపించాలి

ఖాజీపేట, ఫిబ్రవరి 25: ప్రతి ఒక్కరూ టీడీపీకి ఓటు వేసి మైదుకూరు అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ రాష్ట్ర మాజీ మైనార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి సిద్దారం కదీరుల్లా అన్నారు. ఆదివారం 194వ బూత్ పరిధిలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు ప్రవేశపెట్టిన పథకాల గురించి వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ టీడీపీ అభ్యర్థి పుట్టాను అందరం కలిసికట్టుగా పనిచేసి అధిక మెజార్టీతో గెలిపించుకోవాలని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా టీడీపీని గెలిపించేందుకు ప్రజలు సంసిద్ధంగా ఉన్నారని, ఏ ఇంటికి వెళ్లినా టీడీపీనే ఆదరిస్తున్నారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో జాఫర్, కేకే బ్రదర్స్, హుస్సేన్, రత్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు రూరల్..: రాబోవు ఎన్నికల్లో చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని బొజ్జ అరుణ, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు మాచుపల్లె లక్ష్మీదేవి, పోరుమామిళ్ల మాజీ సర్పంచ్ హబీబున్నీసాలు తెలిపారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి టీడీపీ అధికారంలోకి వస్తే అందించే సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో 15వ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ పంగాబాలరాజుయాదవ్, పంగా బాల మురళీయాదవ్, బాలక్రిష్ణయాదవ్, రంగయ్య, ఉదయలక్ష్మి, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





ఖాజీపేట, బద్వేలులో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నేతలు